
# ఢిల్లీ అంకుల్

క్రాంతిసాగర్.వై



కారాపి దిగి చుట్టూ ఒకసారి పరికించి చూశాను. రణగొణ ధ్వనులేమీ లేకుండా ప్రశాంతంగా వుందా ఏరియా. మెట్లెక్కి కాలింగ్ బెల్ నొక్కాను. తలుపు తీసిన భవాని నన్ను చూసి "మూడునెలల తర్వాత యిప్పుడు జ్ఞాపకం వచ్చానా?" అంటూ యుద్ధం మొదలుపెట్టింది.

"నన్ను కాస్త లోపలికి రానివ్వవే" అంటూ లోపలికి అడుగుపెట్టి" పని ఒత్తిడివల్ల రాలేకపోయానమ్మా!" అని భవానీని సముదాయించాను.

చిన్నతనంలో నేను వైజాగ్‌లో వున్నప్పుడు శివరావు నా ప్రాణ స్నేహితుడు. తరువాత నేను హైద్రాబాద్ వచ్చి సెటిలైపోయినా మా స్నేహం కొనసాగుతూనే వుంది. హైద్రాబాద్‌లోనే వుంటున్న శివరావు కూతురు, అల్లుడిని తరచూ వెళ్ళి మంచీచెడూ విచారించే బాధ్యత శివరావు నామీదుంచాడు.

గత మూడుమాసాల క్రితం శివరావు కూతురు యిల్లు మారడం, నేను నా పనుల్లో బిజీగా వుండటంతో వాళ్ళను కలవలేదు. నిన్న శివరావు ఫోన్‌లో అదే విషయంలో అరగంట క్లాస్ పీకేసరికి, వాడికి సారీ చెప్పి, సర్దిచెప్పేసరికి తాతలు దిగొచ్చారు. యివ్వాళ ఖాళీ దొరికిందని వాళ్ళని చూసొద్దామని వచ్చాను.

"యింటికొచ్చిన వాళ్ళమీద యుద్ధానికి దిగడమేనా?... కాఫీతో గొంతు తడిపేది ఏమన్నా వుందా?" అన్నాను సోఫాలో కూర్చుంటూ.

"తెస్తానుండు" అంటూ నవ్వుతూ భవాని వంట గదిలోకి వెళ్ళింది. యిల్లు బాగుంది. పూర్వపు యిల్లు కంటే పెద్దది.

చందన చర్చిత నీల
కళేబర పీతవ స్థనమాలీ...

కేళి చలన్మణి కుండల మండిత
గండయుగస్మిత శాలీ...

భవాని యింటికి వెనుకనున్న యింటినుండి పాట అలవోకగా గాలిలో తేలుతూ నా కర్ణపుటాలను తాకింది. ఓల్డ్ పిక్చర్స్ మెలోడీ సాంగ్స్ అంటే ప్రాణం నాకు. ... నాకు తెలియకుండానే కళ్ళు మూసుకుని పాటలో లీనమైపోయాను.

"మామయ్యా!... కాఫీ!..." భవాని మాటలకు ఉలిక్కిపడి కళ్ళు తెరిచాను. "ఏమిటీ? యీ లోగానే కునికిపాట్లా?" అంది భవాని కాఫీ కప్ అందిస్తూ.

"అహా!.. టేప్ రికార్డర్‌లోనుండి అనుకుంటా... మంచి పాట వినిపిస్తూ వుంటే..." అంటున్న నేను భవాని కిసుక్కున నవ్వడంతో ఆగిపోయి ఆమె వంక చూశాను.

"అది టేప్ రికార్డర్‌లో పాట కాదు... వెనుకింటావిడ పాడుతోంది" అంది భవాని. నమ్మలేనట్టు చూశాను. "కావాలంటే విను... పాటకి ఎక్కడన్నా మ్యూజిక్ వినబడుతుందేమో!" అంది. చెవులప్పగించి విన్నాను.

యశ్యతి కామపి చుంబతి కామపి రమయతి
కామపి రామా...

పశ్యతి చస్మిత చారుతరాం అపరామనుగచ్ఛతి
వామా!...

... నిజమే!... ఎక్కడా మ్యూజిక్ లేదు. ఆశ్చర్యంగా భవాని వంక చూశాను. "ఆవిడ పేరు రాధ... అద్భుతంగా పాడుతుంది. సంగీతంలో డిగ్రీ చేసింది. రేడియో, టి.వి. ప్రోగ్రామ్స్‌లో పాల్గొంటుంది... బట్... బ్యాడ్‌లక్... ఆమె యీ లోకాన్ని చూడలేదు..." ఒక్కింత బాధగా అంది భవాని. చెళ్ళున కొరడాతో చరిచినట్లయింది నాకు. యింతటి అద్భుతమైన కంఠ స్వరాన్నిచ్చిన దేవునికి, ఆమెను అంధురాలిగా చేయడానికి మనస్సెలా ఒప్పిందో?... మనస్సులో బాధ... "ఆ!... మామయ్యా!... వాళ్ళాయిన భాస్కర్ మీ కంపెనీలోనే పనిచేస్తుంటాడు" ఆత్రంగా అంది భవాని.

నిర్ఘాంతపోయాను నేను. "ఆవిడ... భాస్కర్ భార్యా?" అడిగాను. అవునంటూ వాళ్ళ విషయాలు పూర్తిగా వివరించింది.

భాస్కర్ మేనమామ కూతురే రాధ. చిన్నప్పటి నుండి కలిసే పెరిగారు... ఆడుకున్నారు... చదువుకున్నారు. ఒకరంటే మరొకరికి వల్లమాలిన యిష్టం. ఆ యిష్టం వయసొచ్చాక ప్రేమగా మారడంలో వింతేమీ లేదు. చదువయ్యాక భాస్కర్ ఉద్యోగాల వేటలో పడితే, రాధ సంగీతంలో డిగ్రీ చేసి, ఆడియేషన్‌లో సెలక్టై రేడియో, టి.వి.లో ఫ్రోగ్రామ్స్‌లో పాల్గొనేది. భాస్కర్‌కి ఉద్యోగం రావడంతో వేసవిలో పెళ్ళిచేయాలని పెద్దలు నిశ్చయించారు.

ఇంతలో అనుకోకుండా జరిగిన ఒక ప్రమాదంలో కంటి నరాలు బలంగా దెబ్బతిని రాధ అంధురాలైపోయింది. తల్లిదండ్రులు వద్దని ఎంత వారించినా "రాధతోనే నా పెళ్ళి, నా నిర్ణయం మార్చుకునే ప్రసక్తే లేదు"అని ఖరాఖండీగా చెప్పాడు భాస్కర్. అప్పటికీ రాధ కూడా "వేరే ఎవరినైనా వివాహం చేసుకోమని" చెప్పినా, "ప్రేమకు అర్థం మనస్సుల కలయిక. బాహ్య విషయాలకు ప్రాధాన్యత యిస్తే అది ఆకర్షణ మాత్రమే" అని బదులిచ్చాడు. పెళ్ళయిన తర్వాత తన చేతుల ద్వారా 'తాను పెళ్ళిచేసుకున్నది కేవలం పేరు గొప్ప కోసమే' కాదని నిరూపించాడు.

ఇంటి పనులలో రాధని వేలు పెట్టనివ్వడు. అన్నీ తానే చేస్తాడు. "టేబుల్ మీద అన్నీ అమర్చి వెళ్ళండి. మధ్యాహ్నం భోజనం నేనే చేస్తాను. మీరు రానవసరం లేదు" అని రాధ చెప్పినా వినిపించుకోడు. ఆఫీస్ నుండి రావడానికి పావుగంట, వెళ్ళడానికి పావుగంట పట్టినా, లంచ్ అవర్‌లో సైకిల్‌మీద వచ్చి పావుగంటలో భార్యకి దగ్గరుండి వడ్డించి, తను కూడా అక్కడే తింటే ఎక్కడ లేటయిపోతుందోనని హడావుడిగా వెళ్ళిపోతాడు. ఆఫీస్ వదిలిన పావుగంటకి రెక్కలు కట్టుకుని వాలిపోతాడు. మొదట్లో ఇద్దరే కాబట్టి సరిపోయింది. బాబు పుట్టాక వాడు కాన్వెంట్‌కి వెళ్ళే వయసొచ్చేసరికి ఉదయం యింటి పనులతోబాటు, బాబుకి అన్నీ రెడీ చేసి పంపి ఆఫీస్‌కి వెళ్ళేసరికి రోజూ లేటే...

భవాని చెబుతున్నది వింటూ చిత్తరువులా అలాగే వుండిపోయాను. యీ కాలంలో కూడా యింత అపురూపంగా భార్యని... అందునా అంధురాలైన భార్యని ఆరాధించే వ్యక్తులుంటారా? సడన్‌గా యీ రోజే... యిక్కడికి వచ్చేముందే జరిగిన సంఘటన జ్ఞాపకం వచ్చింది.

ఉదయం ఆఫీస్‌కి భాస్యర్ లేటుగా రావడం, పర్సనల్ ఆఫీసర్‌ని రిక్వెస్ట్ చేయడం నా కంట పడింది. గంట తర్వాత పర్సనల్ ఆఫీసర్ నా రూమ్‌కి వచ్చినప్పుడు బిజినెస్‌కి సంబంధించిన విషయాలు మాట్లాడిన

తర్వాత యథాలాపంగా 'భాస్కర్ సంగతేమిటని' అడిగాను.

"అతను డైలీ కొద్దిగా లేట్‌గా వస్తాడు సార్!..." వచ్చాక సారీ చెబుతాడు. చెప్పడానికి సంశయిస్తూ అన్నాడు ఆఫీసర్.

"వెంటనే అతనికి మెమో యివ్వండి" అన్నాను నేను. పంక్చువాలిటీ విషయంలో నేను చాలా స్ట్రిక్ట్ అని అందరికీ తెలుసు.

"వద్దు సార్... తొందర పడకండి" కంగారుగా అన్నాడు ఆఫీసర్. "యీ ఒక్క విషయంలో తప్పించి మిగిలిన అన్ని విషయాలలో చాలా పెర్‌ఫెక్ట్ సార్!... సిన్సియర్ అండ్ హార్డ్‌వర్కర్... ఏం పనిచెప్పినా, ఎంత పని అప్పగించినా, రెండోసారి మనం చెక్ చేయవలసిన అవసరం లేకుండా బిఫోర్ టైమ్‌లో సబ్మిట్ చేస్తాడు. అందుకే అతను లేట్‌గా వస్తే నేను మందలిస్తానే గాని మీ నోటీస్‌కి యింతవరకూ తీసుకురాలేదు."

"మరెందుకు డైలీ లేట్‌గా వస్తాడూ?" ఆశ్చర్యంగా అడిగాను.

"నేనూ ఎన్నిసార్లు అడిగినా చిరునవ్వుతో దాటవేస్తాడు గాని చెప్పడు. అతని ప్రవర్తనే వింతగా వుంటుంది. లంచ్ అవర్ కాగానే వెళ్ళిపోయి, లంచ్ అవర్ యింకో పది నిమిషాల్లో ముగుస్తుందనగా చెమటలు కక్కుకుంటూ వచ్చి ఆదరాబాదరాగా లంచ్ పూర్తి చేస్తాడు. ఎన్నోసార్లు కొలీగ్స్ "ఎక్కడికి వెళ్ళావయ్యా?" అని అడిగితే, "నాకో సెకండ్ ఫ్యామిలీ వుంది. లంచ్ అవర్‌లో తప్పించి మళ్ళీ రోజులో కలుసుకునే అవకాశంలేదు. అందుకే వెళ్ళాను" అని నవ్వేస్తాడు. "టైమయిందంటే ఒక్క క్షణం ఆఫీస్‌లో వుండడు." అన్నాడు ఆఫీసర్...

...అయితే యిదన్న మాట సంగతి. భాస్కర్ ప్రవర్తనకి కారణం యిప్పుడు బోధపడింది. యిప్పుడు భాస్కర్ లేట్‌గా వచ్చినందుకు ఆఫీసర్‌ని ప్రాధేయపడుతున్న సామాన్యుడిలా గోచరించడం లేదు... మానవత్వం మూర్తీభవించిన అసమాన్యుడిలా కన్పిస్తున్నాడు.

మరో అరగంట భవానీతో మాట్లాడి వచ్చి కారులో కూర్చున్నానే గాని, నా మనస్సు భాస్కర్, రాధల అనురాగ దాంపత్యం చుట్టూనే పరిభ్రమిస్తోంది. అంతగా ఆలోచించడానికి కారణం... 'అను'... 'అను' నా గుండెల్లో చేసిన గాయం నేను మరణించేవరకూ వేధిస్తూనే వుంటుంది. రాధతో పోలిస్తే ఆఫ్ట్రాల్ 'అను' సమస్య ఎంత?... మరి తనెందుకు అంత దారుణమైన నిర్ణయం తీసుకుంది?... అయిదు నిమిషాలపాటు అలాగే వుండిపోయాను. రాధను ఒకసారి చూడకుండా వెళ్ళిపోవడానికి మనస్సెందుకో అంగీకరించడం లేదు... వెళ్తే నేనెవరని చెప్పాలి? ... భాస్కర్ పని చేసే యిండస్ట్రీకి యజమానిని అని చెప్పుకోవడానికి మనస్కరించడం లేదు... మరెలా?... చిన్న ప్రాక్టికల్ జోక్ ప్లే చేస్తే?... ఆ ఆలోచన రాగానే చిన్నగా నవ్వుకుని కారుని ముందుకు పోనిచ్చాను.

ఆ ఏరియాలో వున్న పెద్ద ఎలక్ట్రానిక్ షాపు ముందు కారాపాను. అనుకోకుండా ఆ షాపు ఓనర్ నాకు తెలిసినవాడే కావడంతో సాదరంగా ఆహ్వానించాడు. ఒక ఖరీదైన టేప్ రికార్డర్, వాక్‌మెన్, మంగళంపల్లి, యమ్.యస్. లాంటి సంగీత విద్వాంసులాలపించిన కీర్తనల క్యాసెట్లు ఓ పదిహేను, ఓల్డ్ తెలుగు సినిమా మెలోడీస్ క్యాసెట్లు ఓ పదిహేను తీసుకుని అట్టపెట్టెలో అందంగా ప్యాకింగ్ చేయించి, తిరిగి భాస్కర్ యింటి ముందు కారాపాను. భాస్కర్ యింటి గుమ్మం పక్క సందులోకి రావడంవలన నేను తిరిగి రావడం భవాని కంటపడే అవకాశంలేదు. అట్టపెట్టె తీసుకుని మెట్లెక్కి "బాచీ!... ఒరేయ్ భాస్కరం!..." అంటూ తలుపు తట్టాను.

"ఎవరదీ?" అంటూ తలుపు తీసింది రాధ. పదహారణాల తెలుగింటి ఆడబడచులా, ప్రాణం పోసుకున్న బాపు బొమ్మలా వుంది రాధ. "యింత అందమైన

"నా పేరు చెబితే తెలియదు లేమ్మా! వరసకి భాస్కర్‌కి బాబాయినవుతాను. నన్నందరూ 'ఢిల్లీ అంకుల్' అంటారమ్మా!... నువ్వూ, భాస్కర్... ఎలిమెంటరీ స్కూల్‌లో చదువుకునే రోజుల్లో నేను ఢిల్లీ వెళ్ళి సెటిల్ అయిపోవడంతో మీకంతగా జ్ఞాపకం లేకపోవచ్చు గాని మీరందరూ నాకు బాగా తెల్సు.

అమ్మాయికాలోకాన్ని చూసే అదృష్టం లేకపోయిందే?" అన్న తలంపు రాగానే ప్రాణం చివుక్కుమంది. 'తీపిరాగాల కోకిలమ్మకు నల్లరంగునదిమిన వాడినేమి కోరేదీ?'... సిరివెన్నెల సీతారామశాస్త్రి పాటలో చరణం జ్ఞాపకం వచ్చింది. ఆమెనే చూస్తూ అలాగే వుండిపోయిన నేను "ఎవరిదీ అంటే మాట్లాడరేం?" అని రాధ తిరిగి ప్రశ్నించడంతో యీ లోకంలోకి వచ్చాను.

"ఆ!... ఆ!... భాస్కర్ లేడామ్మా?.. ఒరేయ్! భాస్కర్..." అంటూ చనువుగా లోపలికి అడుగుపెట్టాను.

"లేరండీ... ఆఫీస్‌కి వెళ్ళారు" అంది రాధ... ఆ విషయం నాకు తెలియదు గనుకనా!... "ఇంతకూ మీరు..." సందేహంగా అడిగింది.

"నా పేరు చెబితే తెలియదు లేమ్మా! వరసకి భాస్కర్‌కి బాబాయినవుతాను. నన్నందరూ 'ఢిల్లీ అంకుల్' అంటారమ్మా!... నువ్వూ, భాస్కర్... ఎలిమెంటరీ స్కూల్‌లో చదువుకునే రోజుల్లో నేను ఢిల్లీ వెళ్ళి సెటిల్ అయిపోవడంతో మీకంతగా జ్ఞాపకం లేకపోవచ్చు గాని మీరందరూ నాకు బాగా తెల్సు. చిన్నప్పుడు భాస్కరంటే నాకు ప్రాణం. ఎప్పుడో గాని యీ ఆంధ్రాకి రాను. మన బంధువర్గమంతా నన్ను 'ఢిల్లీ అంకుల్' అనే పిలుస్తారు. నువ్వూ అలాగే పిలు... పర్వాలేదు. అసలు మీ పెళ్ళికి వచ్చేవాడినే. అనుకోకుండా పనిమీద ఫారిన్ వెళ్ళడం వలన రాలేకపోయాను. వారంక్రితం ఆంధ్రాకి వచ్చినప్పుడువీళ్ళ వూరెడితే వీడిక్కడవున్నాడని తెలిసింది. నేను నిన్ననే హైద్రాబాద్ పనిమీద వచ్చాను. వచ్చిన పనయిపోయింది. వెళ్ళేముందు వీడ్ని ఒకసారి చూసి వెళ్దామని వస్తే తీరా వీడు లేడు..." గడగడా ఎక్కడా తడుముకోకుండా, ఏమాత్రం అనుమానం వచ్చే అవకాశం లేకుండా, ఆమెకి కలిగే సందేహాలు ముందుగనే ఊహించి, అవి నివృత్తి అయ్యేలా, అసలామెకు ఎక్కువ మాట్లాడే అవకాశం యివ్వకుండా వల్లించి వేయసాగాను.

"ఫర్వాలేదండి... ఒక గంటాగితే లంచ్ అవర్‌కి వారింటికి వస్తారు" అంది రాధ.

"అమ్మో! భాస్కర్ వస్తే నా నాటకం బయటపడిపోదూ?" అనుకుని "లేదమ్మా! నేను ఫ్లైట్‌కి వెళ్ళాలి... టైమయిపోయింది" అంటూ మరో పావుగంట మాట్లాడి వెళ్ళడానికి లేచాను.

"భోజనం చేసి వెళ్ళండి అంకుల్!" అంది రాధ.

"నిన్ను చూస్తేనే నా కడుపు నిండిపోయిందమ్మా! యీసారి వచ్చినప్పుడు తప్పకుండా భోజనం చేస్తాను" అని చెప్పి నేను పట్టుకొచ్చిన అట్టపెట్టె ఆమె చేతిలో పెట్టి "మీ పెళ్ళికి నేనెలాగూ రాలేకపోయాను. యిది నా గిఫ్ట్" అని చెప్పి వచ్చేశాను.

యింటికొచ్చి నా భార్యకి జరిగినదంతా చెప్పాను. "యింత వయసొచ్చీ ఏం పనులండీ యివి?" అని కోప్పడింది కౌసల్య.

"వాళ్ళకి నేనేం హాని చేయలేదే?..." ఎవరీ ఢిల్లీ అంకుల్?" అని భాస్కర్ బుర్ర బ్రద్దలు కొట్టుకుంటాడు. వాళ్ళనెలా సస్పెన్స్‌లో పడేశానో చూశావా?" గర్వంగా అన్నాను.

మరుసటిరోజు ఆదివారం... ఉదయం పదిగంటల సమయంలో బాల్కనీలో అటూ యిటూ పచార్లు చేస్తున్న నేను బయట ఆటో శబ్దం విని తల తిప్పి చూశాను... ఆశ్చర్యం... భాస్కర్, రాధ, వాళ్ళ బాబుతో ఆటో దిగుతున్నారు. గేట్ దగ్గర వున్న వాచ్‌మెన్‌తో వాళ్ళని లోపలికి పంపమని చెప్పి నేను మేడ దిగి హాల్లోకి వచ్చాను.

గుమ్మం దగ్గరే సందేహంగా నిలబడిపోయిన వాళ్ళని చూసి "రావయ్యా! అక్కడే నిలబడి పోయావేమిటి?... లోపలికి రా!" అన్నాను.

నా కంఠ స్వరం వినగానే "అదుగో ఢిల్లీ అంకుల్!" అంది రాధ వెంటనే నవ్వాపుకోలేక పోయాను.

"హుష్!... ఆయన మా బాస్!" రాధ చెయ్యి నొక్కుతూ భాస్కర్ ఆమె చెవిలో అన్న మాటలు నాకు వినిపించకపోలేదు.

"ఫర్వాలేదే! గుర్తు పట్టేశావు" అని వాళ్ళని లోపలికి ఆహ్వానించి నా భార్యని పిలిచి వారికి పరిచయం చేశాను.

"నా భార్య అనూరాధ..." తన భార్యని కౌసల్యకి పరిచయం చేస్తూ అన్నాడు భాస్కర్. అనూరాధ... రాధ పూర్తిపేరు వినగానే ఫిరంగి గుండు గుండెల్లో నుండి దూసుకెళ్ళినట్లనిపించింది. నిగ్రహించుకుని కొన్ని క్షణాల్లోనే మామూలు స్థితికి వచ్చాను. వచ్చిన వారికి కాఫీలు తీసుకు రావడంకోసం కౌసల్య లోపలికి వెళ్ళింది.

"సర్!... నిన్న మీరు..." ఎలా అడగాలో తెలియక ఆగిపోయాడు భాస్కర్.

"అది తరువాత... ముందు నిన్న మీ యింటికి వచ్చింది నేనేనని ఎలా గ్రహించావో చెప్పు?" అన్నాను.

నిన్న లంచ్ అవర్‌లో యింటికి వచ్చినప్పుడు రాధ జరిగింది చెప్పింది. ఎంత ఆలోచించినా 'ఢిల్లీ అంకుల్' ఎవరో నాకు తెలియలేదు. తిరిగి సాయంత్రం యింటికి వచ్చిన తరువాత మీరిచ్చిన గిఫ్ట్ బాక్స్ ఓపెన్ చేసి వెతికితే అందులో పర్చేజ్ రిసీట్ కన్పించింది. వెంటనే అది తీసుకెళ్ళి ఆ షాపు ఓనర్‌ని అడిగాను.

(మిగతా 27వ పేజీలో)

(19వ పేజీ తరువాయి)

ఆయన మీకు బాగా తెలుసునట. ఆయనే చెప్పాడు" అన్నాడు భాస్కర్. "యింతకీ మీరు..."

"నాకు మీ దాంపత్యం గురించి తెలిసింది. నీ భార్యని చూడాలని ముచ్చటేసింది. వట్టి చేతులతో వస్తే బాగుండదని అవి కొని వూరికే యిస్తే ఆమె తీసుకోదేమోనని చిన్న నాటకం ఆడాను. కానీ నువ్వు కనిపెట్టేశావు." అన్నాను నవ్వుతూ. కౌసల్య అందరికీ కాఫీలిచ్చింది.

"భాస్కర్!..." నా గొంతులో గాంభీర్యం చోటుచేసుకుంది. "మన స్టోర్స్ ఆఫీసర్ రేపు ఫస్ట్‌కి రిటైర్ అవుతున్నాడు. నిన్ను ఆ పోస్ట్‌కి ప్రమోట్ చేస్తున్నాను."

ఉలిక్కిపడ్డాడు భాస్కర్. "ఆ!... అన్నట్టు నీకు బైక్ డ్రైవింగ్ వచ్చా?" అడిగాను. అప్రయత్నంగా తలూపాడు భాస్కర్.

"రేపు వెళ్ళి నీకు నచ్చిన బైక్ తీసుకో... నీకు ఆఫీస్‌కి వెళ్ళడానికి, రావడానికి టైమ్ కలిసొస్తుంది... అంతే కాదు... ప్రతీ సెలవురోజున రాధను తీసుకుని సినిమాకో, షికారుకో, పార్కుకో, గుడికో తీసుకెళ్తూ వుండాలి... అర్థమైందా? ... అంతేగాని నీ సెకండ్ ఫ్యామిలీ యింటికి వెళ్ళడానికి కాదు నీకు బైక్ కొనిస్తుందీ!" అన్నాను.

"సెకండ్ ఫ్యామిలీ ఏమిటీ?" ఆశ్చర్యంగా అడిగింది రాధ.

"కొలీగ్స్ లంచ్ అవర్‌లో 'ఎక్కడికి వెళ్తున్నావు' అని భాస్కర్‌ని అడిగితే సెకండ్ ఫ్యామిలీ యింటికి వెడుతున్నానని చెబుతాడు" అని నేను వివరించి చెప్పేసరికి అందరూ నవ్వేశారు. "అంతే కాదు... యింటి పనిచేసే వాళ్ళకి బట్టలుతకడం పెద్ద తలనొప్పి పని. బైక్ కొనడానికి వెళ్ళినప్పుడే వాషింగ్ మెషీన్ ఒకటి కొను. డబ్బు కంపెనీ చెల్లిస్తుందిలే. మీ అబ్బాయి చదువు బాధ్యత యిక కంపెనీదే!..." వాళ్ళ దృష్టిలో యివి చాలా పెద్ద విషయాలే కావచ్చు... కానీ నాకు యివి చాలా చిన్న విషయాలు.

ఆ దంపతుల మొహాలలో విస్మయం... ఆనందం... తేరుకోవడానికి కొన్ని క్షణాలు పట్టింది. భాస్కర్ అతికష్టంమీద "సార్..." అన్నాడు. "ఏమిటిదంతా?" అని అడగాలని వున్నా అడగలేకపోతున్నాడని నాకు తెలుసు. నేను లేచి కౌసల్యతో "అమ్మాయితో మాట్లాడమని' చెప్పి భాస్కర్‌ని నా వెంట రమ్మని మేడ మీద నా గదికి దారితీశాను.

నా గదిలో ఎదురుగా గోడకు 'అను' నిలువెత్తు ఫొటో దండతో అలంకరించి వుంది. "అను!... నా ఏకైక కూతురు... నా ఈ సంపదకు వారసురాలు... చూశావా! ఎంత ముగ్ధ మోహనంగా వుందో!..." బాధగా అన్నాను. "కూర్చో" అని భాస్కర్‌కి సోఫా చూపించి నా 'అను' గురించి చెప్పడం ప్రారంభించాను.

'అను' పోస్ట్ గ్రాడ్యుయేషన్ చేస్తున్నప్పుడు తన సీనియర్ మురళిని యిష్టపడుతున్నానని చెప్పింది. ఆ అబ్బాయి గురించి ఎంక్వైరీ చేయించాను. మంచి కుటుంబం, అబ్బాయి కూడా తెలివైన వాడని తెలియడంతో వారి వివాహం జరిపించాను.

మురళికి ఢిల్లీలో పెద్ద కంపెనీలో మంచి ఉద్యోగం వచ్చింది. నిజానికతను వేరే ఉద్యోగం చేయనవసరం లేదు... నా బిజినెస్‌నే వారిద్దరూ చూసుకుంటే చాలు... వాళ్ళేగా వారసులు... అయినా... కొత్తగా పెళ్ళయిన జంట... వాళ్ళకీ ప్రైవసీ కావాలని నేను అభ్యంతరం చెప్పలేదు. ఢిల్లీలో వాళ్ళకో ఫ్లాట్, కారు కొనిచ్చాను. కొంత కాలం హేపీగానే గడిచిపోయింది.

క్రమంగా మురళి దుర్వ్యసనాలకు లోనయ్యాడు... ఒకసారి పార్టీకి భార్యతో వెళ్ళి అక్కడ విపరీతంగా తాగి 'అను' వద్దని చెబుతున్నా వినక, కారు తానే డ్రైవ్ చేస్తూ ఏక్సిడెంట్ చేశాడు. మురళికి పెద్ద దెబ్బలు తగల్లేదు గాని, 'అను' మోకాలి చిప్ప బ్రద్దలైంది. స్టీల్ డిష్ వేశారు. మురళి గురించి చెబితే నేనెక్కడ బాధపడతానేమోనని 'అను' మురళి గురించి నాకేమీ చెప్పలేదు. ఏక్సిడెంట్ విషయం తెలిసి నేను ఢిల్లీ వెళ్తే అప్పుడు మురళి భాగోతం అంతా బయటపడింది.

మోకాలికి స్టీల్ డిష్ వేయడంతో 'అను' నడకలో మార్పువచ్చింది. ఆ తర్వాత మురళీ మరీ పేట్రేగిపోయాడు. 'అను'తో కలిసి బయటికి వెళ్తే తన డిగ్నిటీకి భంగమని, 'అను'ని బయటికి తీసుకెళ్ళేవాడే కాదు. వేరే అమ్మాయితో సంబంధం పెట్టుకుని, ఆ అమ్మాయిని డైరెక్ట్‌గా యింటికే తీసుకొచ్చేవాడు. 'అను'ని 'ఒసే కుంటిదానా!' అని 'కుంటి కులాసం' అని అవహేళన చేస్తూ మానసికంగా, తర్వాతర్వాత శారీరకంగానూ హింసించడం మొదలుపెట్టాడు. యిక తట్టుకోలేక 'అను' నాకు ఫోన్ చేసి అంతా చెప్పి భోరుమని విలపించింది. వెంటనే ఢిల్లీ వెళ్ళి 'అను'ని నాతో తీసుకువచ్చేశాను.

లాయర్‌ని పిలిచి మురళికి డైవోర్స్‌కి, అతని మీద క్రిమినల్ కేసులు ఫైల్ చేయమని చెప్పాను... కానీ... ఒకరోజు... నా 'అను' స్లీపింగ్ టాబ్లెట్స్ మింగి...

"కంఠంలో దుఃఖం సుడులు తిరగడంతో మాట పూర్తి చేయలేకపోయాను. కొన్ని క్షణాలు తర్వాత తేరుకుని "తన తప్పులేకపోయినా, భర్త కారణంగా అవిటిదైపోయి, ఆత్మస్థయిర్యం లేక నా కూతురు ప్రాణాలు తీసుకుంది... కానీ నువ్వు?... పెళ్ళికి ముందే నీ భార్య లోపం తెలిసి కూడా నీ జీవితంలోకి ఆహ్వానించి నిష్కళంక ప్రేమకు నిర్వచనం చెప్పావు... రియల్లీ యూ ఆర్ గ్రేట్... అందుకే నిన్ను లైక్ చేస్తున్నాను" అన్నాను.

మరో గంట తర్వాత భాస్కర్ దంపతులు వెళ్తున్నప్పుడు భోజనం చేసి వెళ్ళమని ఎంత బలవంతం చేసినా వినలేదు. కౌసల్య రాధకి బొట్టు పెట్టి చీర పెట్టింది.

"మేమేది అడగకుండానే ఎంతో పెద్దమనస్సు చూపించారు. మళ్ళీ యిది ఎందుకమ్మా?" అంది రాధ.

"నువ్వు నా కూతురు లాంటి దానివి. పుట్టింటికి వచ్చావనుకో!" అంది కౌసల్య.

రాధ నా కాళ్ళకు నమస్కరించి "వస్తానంకుల్!" అంది.

"నో... నో... మామూలు అంకుల్ కాదు... ఢిల్లీ అంకులు అనాలి" అన్నాను నవ్వుతూ.

వాళ్ళు వెళ్ళిపోయాక మేడమీద నా గదిలోకి వచ్చాను. నా వెనకే కౌసల్య వచ్చింది. "చూశావా కౌసల్యా! రాధతో పోలిస్తే 'అనూ' లోపం ఎంత?... కాలు, చెయ్యి... చెవి... మనిషికి ఏ లోపం వున్నా పెద్దగా యిబ్బంది లేదు... కానీ కళ్ళే లేకపోతే?... అంతా అంధకారమే... యిద్దరిలోనూ లోపం వుంది. చిన్న లోపం వున్న మన అమ్మాయి ఓటమిని అంగీకరించి జీవితంనుండి నిష్క్రమించింది. పెద్ద లోపం వున్న అమ్మాయి మనకున్నంత ఐశ్వర్యం లేకపోయినా ఆనందంగా జీవితం గడుపుతోంది. అందుకే వాళ్ళకి చేతనైనంత ఉపకారం చేయాలనిపించింది" అన్నాను.

"అదొక్కటే కాదు మీరివన్నీ చేయడానికి కారణం. మరొకటి వుంది. అదేమిటో మీరు చెబుతారా?... నన్ను చెప్పమంటారా?" అంది కౌసల్య చిన్నగా నవ్వుతూ.

"వేరే కారణమా?" నాకు అంతుబట్టలేదు. ఆశ్చర్యంగా చూస్తూ "చెప్పు?" అన్నాను.

"సెంటిమెంట్!... మన 'అను' పూర్తి పేరు అనూరాధ... భాస్కర్ భార్యపేరు అనూరాధే... మీ మనసు పొరలలో ఏ మూలనో దాగివున్న యీ సెంటిమెంటే మీ చేత యివన్నీ చేయించిందని నేననుకుంటున్నాను" అంది కౌసల్య.

కౌసల్య చెప్పింది కూడా నిజమేనేమో! అంతర్గతంగా నా మనస్సులో ఆ భావం వుందేమో! కాదని ధైర్యంగా చెప్పలేకపోయాను. ★

**రచయిత చిరునామా:**
క్రాంతిసాగర్.వై.
కేరాఫ్ శ్రీ సత్యనారాయణ భట్,
వాసుకీ నిలయం, 8-3-164/సి/4/ఎ,(134)
గోకుల్ థియేటర్ వెనుక, ఎర్రగడ్డ,
హైదరాబాద్- 500 038.

